ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 26.12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల ఐదవ సదస్సు ఈరోజు కొత్త ఢిల్లీలో ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రధానమంత్రి ప్రసంగించనున్నారు.
2. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.
3. రాష్ట్రంలోని పలువురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. సీనియర్ అధికారి జయేశ్ రంజన్ ను పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది.
4. శాస్త్ర విజ్ఞానాన్ని ఆధునిక అవసరాలకు తగినట్లుగా మలచుకోవడమే లక్ష్యంగా ఈ ఉదయం తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళనం ప్రారంభమైంది.

------------------------------

**PM - CHIEF SECRETARIES**

రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల ఐదవ సదస్సు ఈరోజు కొత్త ఢిల్లీలో ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రధానమంత్రి రేపు, ఎల్లుండి పాల్గొంటారు. జాతీయ అభివృద్ధి అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిరంతర చర్చలు సాగించాలన్న లక్ష్యంపై చర్చ జరుగుతుంది. ప్రధానమంత్రి సహకార సమాఖ్య విధానాన్ని అనుసరించి మానవ వనరుల సామర్థ్యాన్ని భవిష్యత్తు సమ్మిళిత అభివృద్ధి కోసం వినియోగించుకునే దిశగా కేంద్రం, రాష్ట్రాలు సంయుక్త కార్యాచరణపై సదస్సులో విస్తృత చర్చలు చేస్తారు.

**NSD**

-------------------------------

**జిహెచ్ ఎంసి...**

హైదరాబాద్ మహా నగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లుగా ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 150 వార్డులుండగా.. దానిని ప్రస్తుతం 300 వార్డులు విస్తరించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. కుత్బుల్లాపూర్ జోన్‌లో అత్యధికంగా ఏడు సర్కిళ్లను ఏర్పాటు చేశారు. శేరిలింగంపల్లి, కూకట్ పల్లి, చార్మినార్, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లను కొనసాగిస్తూనే అదనంగా కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ జోన్లు ఏర్పాటు చేశారు. కొత్త జోన్లకు కమిషనర్లను కూడా నియమించారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్ పునర్విభజన ప్రక్రియ పూర్తయినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**(డెస్క్)**

-------------------------

**ఐఎఎస్ ల బదిలీలు...**

రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. కొందరు గ్రూప్-1 అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జీహెచ్ఎంసీలో జోన్లకు జోనల్ కమిషనర్లను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవోగా పనిచేస్తున్న సీనియర్ ఐఎఎస్ అధికారి జయేశ్ రంజన్ ను మెట్రోపాలిటన్ ఏరియా, హెచ్ ఎం డి ఏ పరిధి పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

**( డెస్క్)**

--------------------------------

**భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్...**

తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ఈ ఉదయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ , ఆర్ ఎస్ ఎస్

చీఫ్ మోహన్ భగవత్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో విజ్ఞానానికి కొదవలేదని, 2038 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుతస్తుందని చంద్రబాబునాయుడు అన్నారు. ఈ నెల 29 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. మన పూర్వీకులు అందించిన శాస్త్ర విజ్ఞానాన్ని ఆధునిక అవసరాలకు తగినట్లుగా మలచుకోవడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం అని నిర్వాహకులు తెలిపారు.

**(డెస్క్)**

-----------------------------

**ఖమ్మం...**

ఖమ్మం జిల్లా వాసులు వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (VB G Ram G) బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలపడం పట్ల ఖమ్మం జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. కొత్త బిల్లు ఉద్దేశాలు మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉన్నాయయిని కొనియాడారు. 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచడం ద్వారా పేదల ఆదాయ భద్రత మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంకు చెందిన ఆదర్శ రైతు మందనపు రామారావు ఆకాశవాణి తో మాట్లాడుతూ....

**<u>బైట్...రైతు మందనపు రామారావు</u>**

**( పిటిసీ - ఖమ్మం)**

-----------------------------

**దివ్యాంగులు:**

పలు పోటీ పరీక్షల్లో విజయం సాధించిన దివ్యాంగులు తమ స్పెషల్ ఎడ్యుకేటర్ల విజయోత్సవాన్ని ఈ రోజు హైదరాబాద్ లో నిర్వహించారు. దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేసిన డాట్ రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులను, అనేకమంది దివ్యాంగులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందటానికి శిక్షణ ఇచ్చిన K శ్రీనివాస రెడ్డిని ఈ సందర్భంగా దివ్యాంగులు సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షులు బుర్రా వెంకటేశం, సహా పలువురు

ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకుని, జీవితంలో ముందడుగు వెయ్యాలని ఈ సందర్భంగా ఉద్బోధించారు.

**MSL**

---------------------------

**నల్లగొండ జిల్లా**

గ్రామ స్థాయిలో ప్రథమ చికిత్స అందించడంలో ఆర్ఎంపీల పాత్ర కీలకమని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని శుశ్రుత గ్రామీణ వైద్య సంఘం 19వ వార్షికోత్సవాల్లో మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడంతో పాటుగా వారిలో ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన కల్పించాలని ఆర్ ఎంపీలను కోరారు. ప్రభుత్వ వైద్య సేవలను విస్తరిస్తున్నామని, సామాన్యులకు, ముఖ్యంగా గ్రామీణులకు మెరుగైన ఆధునిక వైద్యాన్ని అందుబాటులలోకి తేవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**( పిటిసీ - నల్గొండ)**

--------------------------------

**మంచిర్యాల**

మంచిర్యాల నియోజక వర్గంలోని నాలుగు ఎత్తిపోతల పథకాల కోసం 74 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. ఈ నిధులతో మోదెల, గూడెం, ద్వారక, గుడిరేవు ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ఈ నాలుగు ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు ఎనిమిది వేల ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. ఈ పనులు 2027 చివరి నాటికి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

**( పిటిసీ - మంచిర్యాల)**

-------------------------------

**కొత్తగూడెం...**

వికసిత్ భారత్- జి రాం జీ చట్టాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు స్వాగతిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఈ చట్టం సామాన్యులకు ఎలా ఉపయోగపడుతుందో భద్రాద్రి జిల్లా వెంగన్నపాలెం సర్పంచ్ ఆంగోత్ రామారావు ఆకాశవాణి ప్రతినిధితో పంచుకున్నారు.

**బైట్.. ఆంగోత్ రామారావు..**

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

-----------------------------------

**హరీశ్ రావు**

యూరియా సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా కొరతను నివారించడానికి ప్రత్యేక యాప్ తీసుకొచ్చామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సకాలంలో రైతులకు యూరియా అందడం లేదన్నారు. రాష్ట్ర రైతాంగానికి అవసరమైన మేరకు యూరియాను అందచేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**(డెస్క్)**

------------------------------

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో నిన్న కూడా రాష్ట్రంలోనే 7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత తిర్యాని మండలం గిన్నెదరిలో నమోదైంది. జిల్లాలోని 4 మండలాల్లో 9 డిగ్రీల కంటే తక్కువగా, 11 మండలాల్లో 12 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

**(పిటిసీ - కరీంనగర్)**

------------------------------

**కరీంనగర్**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జరుగుతున్న కాకా వెంకట్ స్వామి మెమోరియల్ తెలంగాణ అంతర్ జిల్లా  టీ -20 లీగ్ ఫైనల్ మ్యాచ్ ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,  వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. కరీంనగర్ vs రాజన్న సిరిసిల్ల జిల్లా జట్లు ఫైనల్ లో పోటీ పడుతుండగా మంత్రి ప్రభాకర్ టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ లో హైదరాబాద్ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్టేడియం నిర్మాణానికి హుస్నాబాద్ లో 20 ఎకరాలు కేటాయిస్తామన్నారు.

**( పీటీసీ - కరీంనగర్)**

---------------------------------